


న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ

నరసరావుపేట టౌన్: 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎన్.సత్యశ్రీని పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 53,210 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 7,620 క్యూసెక్కులు వదులుతున్నారు.



4,130 లీటర్ల మద్యం ధ్వంసం

దాచేపల్లి : అక్రమ మద్యం కేసుల్లో స్వాధీనం చేసుకున్న 4,130 లీటర్ల మద్యాన్ని బుధవారం పోలీసులు ధ్వంసం చేశారు. గురజాల డీఎస్పీ జగదీష్, సీఐ భాస్కర్ పాల్గొన్నారు.

నిజంపై కూటమి జులుం

సాక్షిపై అక్రమ కేసులు

వాస్తవాలను వెలుగులోకి తెస్తున్నందుకే సాక్షి పత్రికపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. నిజాలు రాస్తుంటే తట్టుకోలేక కేసుల మీద కేసులు పెడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాక్షి విలేకరులు, ఎడిటర్‌పై ఏకంగా ఐదు కేసులు నమోదు చేసింది. ఇవన్నీ కూడా ప్రభుత్వ వైఫల్యాలు, రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ప్రశ్నించినందుకు పెట్టినవే కావడం విశేషం. సాక్షి గొంతు నొక్కడానికి కుట్రలో భాగంగానే ప్రభుత్వం పోలీసులను పావులుగా ఉపయోగిస్తోంది. తమకు అనుకూలంగా ఉండే అధికారులతో ఫిర్యాదులు చేయించి, పోలీసులతో కేసులు నమోదు చేయిస్తోంది. బెయిలబుల్ కేసుల్లో కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలనే కక్షపూరిత వైఖరిని అవలంబిస్తోంది.

- అతిగా మద్యం తాగి చనిపోయాడని రాసినా కేసు
- దేశం నేతలు హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ రాస్తే నాన్ బెయిలబుల్ కేసు
- వర్షాలకు పంట పొలాలు మునిగిపోయాయని చెప్పిన ప్రెస్‌మీట్ కవర్ చేస్తే కేసు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో అక్రమ కేసుల పరంపర
- ఇటీవల సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డిని మూడు గంటల సేపు విచారించిన తాడేపల్లి పోలీసులు



జూన్ 9న మంగళగిరిలోని సాక్షి యూనిట్ కార్యాలయంపై దాడి చేస్తున్న కూటమి శ్రేణులు



సెప్టెంబర్ 11న సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డికి సంఘీభావంగా గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్న జర్నలిస్టులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గతంలో తెలుగుదేశం నాయకులు, అమరావతి జేఏసీతో కలిసి మంగళగిరి సాక్షి కార్యాలయంపై దాడి చేశారు. అయితే, దీనిపై ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ పోలీసులు కేసు కూడా నమోదు చేయలేదు. నరసరావుపేట బరంపేట చాకిరాలగుట్టకు చెందిన పాలెం కోటేశ్వరరావు అతిగా మద్యం తాగి చనిపోయాడని పోలీసులు చెప్పారు. దాన్ని సాక్షితో పాటు ఈనాడు, ఆంధ్రజ్యోతి కూడా రాశాయి. అయితే, ఆ వార్తను రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో మద్యం తాగి చనిపోయిన వాళ్లతో కలిపి వాడారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని సాక్షిపై మద్యం తాగి చనిపోయిన వ్యక్తి భార్య నుంచి ఫిర్యాదు తీసుకుని క్రిమినల్ కేసు నమోదు చేశారు.

✔ రెండు నెలల క్రితం వరుసగా కురిసిన భారీ వర్షాలకు కొండవీటి వాగు పొంగి పొన్నూరు నియోజకవర్గంలో వేల ఎకరాల్లో పంట పొలాలు మునిగిపోయాయని వైఎస్సార్‌సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ చెప్పిన విషయాన్ని సాక్షి ప్రచురించింది. దీనిపై తాడేపల్లి, పొన్నూరులలో ఇరిగేషన్ అధికారులతో ఫిర్యాదు చేయించి ఎడిటర్‌పై కేసులు నమోదు చేశారు.

✔ డీఎస్పీల ప్రమోషన్లలో అవకతవకలపై రాసిన కథనానికి రాష్ట్ర పోలీసు అధికారుల సంఘ నేతలతో ఫిర్యాదు చేయించింది. తాడేపల్లి స్టేషన్‌లో ఎడిటర్‌తో పాటు మరో ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో వారిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారణ పేరుతో మూడు గంటలపాటు హైడ్రామా నడిపారు.

✔ పల్నాడు జిల్లాలో జరిగిన ఓ హత్య కేసుకు సంబంధించి తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల్లో ప్రచురితమైన కథనాల ఆధారంగా సాక్షి యాజమాన్యంపై కుట్రపూరిత కేసులకు దిగారు. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోని పశువేముల గ్రామానికి చెందిన వండ్ల హరిశ్చంద్ర వైఎస్సార్ సీపీలో క్రియాశీలక నాయకుడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హరిశ్చంద్ర లక్ష్యంగా టీడీపీ నాయకులు వేధింపులకు పాల్పడ్డారు. దీంతో కుటుంబం గ్రామం వదిలి తెలంగాణలోని నల్లగొండ జిల్లా కనగల్‌లో తలదాచుకుంటోంది. హరిశ్చంద్ర సామాజిక పింఛన్ డబ్బుల కోసం ప్రతి నెలా గ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో టీడీపీ నేతలు కిడ్నాప్ చేశారు. ఆయన భార్య నిర్మల భర్త కిడ్నాప్ అయినట్లు తెలంగాణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన నల్లగొండ జిల్లా విజయపురి టౌన్ పోలీసులు, పశువేములలో హరిశ్చంద్ర మృతదేహాన్ని గుర్తించారు. తెలంగాణ పోలీసులు మృతుని భార్య ఫిర్యాదు మేరకు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఇదే విషయాన్ని అక్కడ సాక్షి పాత్రికేయులు కథనం అందించారు. ఆంధ్రప్రదేశ్‌లో కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియడం, మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన వాంగ్మూలం మేరకు కథనం ప్రచురించారు. దీనిపై తెలుగుదేశం పార్టీ నాయకులు ఆగమేఘాల మీద సాక్షి యాజమాన్యం, సిబ్బందిపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వెంటనే స్పందించి సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డితో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

పత్రికా స్వాతంత్య్రాన్ని కాపాడాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రాగానే అమలు చేసిన రెడ్‌బుక్ రాజ్యాంగపు దాడులు, హత్యలను సాక్షి పత్రిక మాత్రమే సాహసోపేతంగా వెలుగులోకి తెచ్చింది. గొప్పగా ప్రతిపక్ష పాత్ర పోషించింది. దీన్ని సహించలేని కూటమి ప్రభుత్వం సాక్షి పత్రిక కార్యాలయం మీద, ఎడిటర్ ధనుంజయరెడ్డిపై వేధింపులు, దాడులను పోలీసులతో చేయిస్తోంది. హైకోర్టు, సుప్రీం కోర్టులు, ప్రెస్ కౌన్సిల్ మందలించినా కూడా ధోరణి మారలేదు. ఉన్నత న్యాయస్థానమే సుమోటోగా కేసు తీసుకుని దీనిపై న్యాయం చేయాలి,

– ఈదర గోపీచంద్, నైతిక విప్లవం పత్రిక ఎడిటర్

పత్రికలకు ప్రాధాన్యత ఇవ్వాలి



ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పత్రికలకు ప్రాధాన్యతతో పాటు స్వేచ్ఛ ఇవ్వాలి. ఫోర్త్ ఎస్టేట్‌గా మీడియా ఉన్నప్పుడు దాని పూర్తి స్వేచ్ఛనిచ్చే బాధ్యత ప్రభుత్వాలు వహించాలి. పత్రికలపై రాజకీయ కక్షలకు పాల్పడ కూడదు. పత్రికలు సమస్యలను రాసినప్పుడు వాటిని పరిష్కరించాలి గానీ పోలీసుల ద్వారా దాడులు చేసి, భయభ్రాంతులకు గురి చేయడం సరికాదు.

– నళినీకాంత్, సీపీఎం నగర కార్యదర్శి

పత్రికలు ప్రజా గొంతుకలు



ప్రజా గొంతుగా సాక్షి పని చేస్తోంది. ప్రభుత్వాలు ఎన్ని మారినా పత్రికలే ప్రతిపక్షాలుగా నిలబడతాయి. ప్రజాభిప్రాయాలు, ప్రజలకు, ప్రభుత్వాలకు పత్రికలు వారధులుగా వ్యవహరిస్తాయి. ప్రజల గొంతుక అయిన పత్రికలపై దాడులు చేయడం అనాగరికం. ప్రభుత్వాలపై వచ్చే వార్తలకు స్పందించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలి. వార్తలు రాసిన పత్రికలపై దాడులు చేయడం దారుణం. గతంలో ఎన్నడూ ఇలాంటివి జరగలేదు. ప్రధానంగా రాష్ట్రంలో గత కొంత కాలంగా సాక్షి ఎడిటోరియల్, సిబ్బంది, విలేకరులపై ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయిస్తూ, కేసులు బనాయించడం సరికాదు.

– కొండా శివరామిరెడ్డి, అవగాహన సంస్థ కార్యదర్శి

వేధింపులు సిగ్గుచేటు



కల్తీ మద్యం తాగి మృతి చెందాడని ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చిన వారిని అభినందించాల్సింది పోయి కేసులు పెట్టడం సబబు కాదు. నోటీసుల పేరుతో వారిని ఇబ్బందిపెట్టే ప్రక్రియ ఏమాత్రం క్షమార్హం కాదు. పత్రికల కార్యాలయాలకు పోలీసులు వెళ్లి విచారణ పేరుతో ఇబ్బందులు పెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకం. ప్రభుత్వం ఇప్పటికైనా తప్పును తెలుసుకొని వ్యవహరించాలి.

–స్వామి, ఇంటలెక్చ్యువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి

న్యూస్‌రీల్

జేసీగా భావన వశిష్ట బాధ్యతల స్వీకారం



బాపట్ల: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా భావన వశిష్ట బుధవారం బాధ్యతలు చేపట్టారు. 2019 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈమె కాకినాడ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో కృష్ణా జిల్లాలో ఏసీయూటీ, పార్వతీపురంలో సబ్ కలెక్టర్, జీఎస్‌ఎస్‌డబ్ల్యూఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్, ఆ జిల్లాలో సంయుక్త కలెక్టర్ పని చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. తొలుత ఆమెకు డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్, జిల్లా కలెక్టరేట్ ఏఓ మల్లికార్జునరావు ఘన స్వాగతం పలికారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలన్నీ జిల్లాలోని పేద ప్రజలకు అందేలా చూస్తామన్నారు. ఆమెను అభినందించిన వారిలో బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీఓలు పి.గ్లోరియా, చంద్రశేఖర్ నాయుడు, ఎన్.రామలక్ష్మి, బాపట్ల తహసీల్దార్ సలీమా షేక్ ఉన్నారు.

రైతు బజార్ తనిఖీ



బాపట్ల: రైతు బజారులో రైతులు పంటలు విక్రయించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్‌శాఖ ఏడీ కారుమూరి రమేష్ బాబు పేర్కొన్నారు. స్థానిక రైతు బజార్‌ని బుధవారం తనిఖీ చేశారు. మౌలిక వసతులను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఆయన వెంట రైతు బజార్ ఎస్టేట్ అధికారి ఘట్రాజు ఫణీంద్ర ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు



జరాడ్‌బాబు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా పణిదం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఎం.జరాడ్‌బాబుపై సస్పెన్షన్ వేటు పడింది. పాఠశాలలో పదో తరగతి విద్యార్థినితో ఈ నెల 13న అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఆమె జరిగిన సంఘటనను తల్లిదండ్రులకు తెలియజేసింది. దీంతో మర్నాడు తల్లిదండ్రులు, బంధువులు, గ్రామ పెద్దలు, మహిళలు ఉపాధ్యాయుడిని నిలదీశారు. ఈ క్రమంలో కొందరు మహిళలు దేహశుద్ధి కూడా చేశారు. దీనిపై విద్యాశాఖ అధికారులు పంపిన ప్రాథమిక నివేదిక ఆధారంగా జరాడ్ బాబును సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారిణి ఎల్. చంద్రకళ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

రెండు క్రస్ట్ గేట్లు ద్వారా నీటి విడుదల



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతుండటంతో రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 67,030 క్యూసెక్కులు వచ్చి చేరటంతో ఇక్కడి నుంచి అంతే మొత్తంలో అధికారులు దిగువకు వదులుతున్నారు. అందులో కుడి కాలువకు 10,040, ఎడమ కాలువకు 6,401, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 33,251, ఎస్‌ఎల్‌బీసీకి 1,200 క్యూసెక్కుల వరద చేరుతోంది. ప్రస్తుతం సాగర్ జలాశయంలో 311.1486 టీఎంసీలు నిల్వ ఉంది.

సుబ్బారాయుడి హుండీ ఆదాయం రూ.97.5లక్షలు

మోపిదేవి: కృష్ణాజిల్లా మోపిదేవిలో వేంచేసి యున్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు హుండీల్లో సమర్పించే కానుకలు రూ. 97,50,092 వచ్చినట్లు డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామవరప్రసాదరావు బుధవారం తెలిపారు. 97 రోజులకు గాను హుండీ ఆదాయం రూ.97,50,092 నగదు, ఒక కిలో 452 గ్రాముల వెండి, 41 గ్రాముల 432 మిలీ గ్రాములు బంగారం, అమెరికన్ డాలర్లు 87, ఆస్ట్రేలియన్ డాలర్లు 5 కానుకల రూపంలో వచ్చినట్లు వివరించారు.



కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ చీరాల సమన్వయకర్త కరణం వెంకటేష్ బాబు

కూటమి కుట్రలు బహిర్గతం చేద్దాం

- వైఎస్సార్ సీపీ చీరాల సమన్వయకర్త కరణం వెంకటేష్‌బాబు
- కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

చీరాల: రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కూటమి కుట్రలను బహిర్గతం చేద్దామని వైఎస్సార్ సీపీ చీరాల సమన్వయకర్త కరణం వెంకటేష్ బాబు పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం స్థానిక క్యాంపు కార్యాలయంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో కొత్తగా 17 మెడికల్ కాలేజీలను రాష్ట్రానికి తీసుకొస్తే, వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతోందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఆధీనంలో కాకుండా ప్రైవేటుపరం అయితే ఫీజులు ఎక్కువగా ఉంటాయని, పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి కుట్రలను బహిర్గతం చేయడానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యాచరణ రూపొందించారని వివరించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అనాలోచిత చర్యలను వ్యతిరేకిస్తూ ప్రజల నుంచి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేస్తున్నట్లు చెప్పారు. చీరాల నియోజకవర్గంలో 60 వేల మంది సంతకాలు సేకరించి వాటిని పార్టీ కేంద్ర కార్యాలయంలో అందించనున్నట్లు పేర్కొన్నారు. వాటిని పార్టీ తరపున గవర్నర్‌కు పంపిస్తామని వెల్లడించారు.

పాలనపై తీవ్ర అసంతృప్తి..

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో సాగుతున్న పాలనపై ప్రజల్లో కూడా తీవ్ర అసంతృప్తి ఉందని కరణం వెంకటేష్ బాబు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు మేలు జరిగేలా మెడికల్ కాలేజీలను తీసుకొస్తే వాటిని ప్రైవేటు పరం చేసి దండుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్యక్రమాన్ని వార్డుల్లో, గ్రామాల్లో నిర్వహించేందుకు గ్రామాలు, మండలాల వారీగా కమిటీలు వేస్తామని చెప్పారు. కార్యకర్తలు, నాయకులు తరలి వచ్చి కోటి సంతకాలు పూర్తి చేయాలని కోరారు. తాను నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని భరోసా కల్పించారు. రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతోందని, నకిలీ మద్యం వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను రచ్చబండ కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు యాతం మేరి బాబు, దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గవిని శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాసిమళ్ల వాసు, లీగల్ సెల్ అధ్యక్షుడు రాజు వెంకటేశ్వరరెడ్డి, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, వేటపాలెం మండల అధ్యక్షుడు సాధు రాఘవ, మాజీ అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, రమణారెడ్డి, కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, కంపా అరుణ్, చీమకుర్తి బాలకృష్ణ, మైనార్టీ సెల్ నాయకులు షేక్ కబీర్, విద్యార్థి విభాగం జిల్లా నాయకులు గోసాల అశోక్, పి.శ్రీనివాసరెడ్డి, రాజ్ కుమార్, సాంబిరెడ్డి, బిట్రా శ్రీనివాసరావు, డి.వెంకటసుబ్బారావు, ఎ.కొండలు, ఖాదర్ పాల్గొన్నారు.



సంతకం చేస్తున్న సమన్వయకర్త కరణం

స్వదేశీ దర్శన్‌తో సూర్యలంక బీచ్‌కు మహర్దశ

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

బాపట్ల: స్వదేశీ దర్శన్– 2.0 కింద సూర్యలంక బీచ్ అభివృద్ధి పనులు గురువారం నుంచి ప్రారంభించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. అభివృద్ధి పనులపై అనుబంధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సూర్యలంక బీచ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.97.52 కోట్లు నిధులు విడుదల చేసిందని తెలిపారు. అందులో భాగంగా 3.5 ఎకరాల విస్తీర్ణంలో పర్యాటకుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. మరో రెండు ఎకరాల విస్తీర్ణంలో శాశ్వత దుకాణాల నిర్మాణం, వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. 1.5 కిలో మీటర్ల దూరం వరకు బోట్ల ద్వారా కెనాల్లో పర్యటించేందుకు అభివృద్ధి చేయాలని చెప్పారు. పరిసరాలు సుందరీకరణలో భాగంగా బీచ్ వద్ద మంచి మొక్కలు నాటాలని, పర్యాటకులకు ఆహ్లాదాన్ని కలిగించేలా నిర్మాణాలు చేయాలని కోరారు. బీచ్ అభివృద్ధి పనులు 2026 సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. రక్షిత తాగునీటి వనరులు లేని దృష్ట్యా తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

జాతీయ రహదారి పనులు...

వాడరేవు– చిలకలూరిపేట జాతీయ రహదారి 167ఏ నిర్మాణాన్ని సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు. 47 కిలోమీటర్ల పొడవునా నిర్మించే రహదారి బాపట్ల జిల్లాలోనే 35 కిలోమీటర్ల పొడవున వెళ్తుందని చెప్పారు. చీరాల వాడరేవు బీచ్ వద్ద జాతీయ రహదారి ముగుస్తున్నందున చిన్న పార్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో వెళ్లే రహదారికి ఇరువైపులా 5,500 మొక్కలు నాటాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ఆక్వా పార్క్‌కూ ప్రాధాన్యం..

ఆక్వా పార్క్ 192.42 ఎకరాలలో అభివృద్ధి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమీకృత ఆక్వా పార్క్ నిర్మాణం ద్వారా మత్స్యకారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. జిల్లాకు రూ. 88.08 కోట్లు మంజూరయ్యాయన్నారు. జిల్లా అభివృద్ధిలోనూ ఆక్వా పార్క్ ప్రాధాన్యం సంతరించుకోనుందన్నారు. నిజాంపట్నం రేవు 60 శాతం నిర్మాణం పూర్తయిందని వివరించారు. సమావేశంలో పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి, ఏజెన్సీ ప్రతినిధులు, ఎన్‌హెచ్‌ఏ అధికారులు, గుత్తేదారుడు దిగ్విజయ్ సింగ్, మత్స్య శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

అందుబాటులో 308 మెట్రిక్ టన్నుల యూరియా

జిల్లాలో 308 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆర్‌ఎస్‌కేలు, పీఏ సీఎస్‌ల 412 మెట్రిక్ టన్నుల యూరియాను 4,786 మంది రైతులకు పంపిణీ చేసినట్లు చెప్పారు.

బీచ్ వద్ద ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రణాళిక

బాపట్ల: బాపట్ల, చీరాల రామాపురం బీచ్‌లకు వచ్చే పర్యాటకులు ప్రమాదాలకు గురికాకుండా ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశించారు. బుధవారం బాపట్ల, చీరాల రామాపురం బీచ్‌ల వద్ద పర్యాటకుల భద్రతపై వీడియో కాన్ఫరెన్స్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బీచ్‌లో సముద్ర స్నానానికి వచ్చే పర్యాటకులకు ఆడియో, వీడియోల ద్వారా అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా టూరిజం అధికారి నాగిరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, జిల్లా అగ్నిమాపక అధికారి వినోద్ పాల్గొన్నారు.

ఆక్వా పార్క్, ఓడరేవు పనులు పరిశీలన

నిజాంపట్నం: మండలంలోని హార్బర్‌ని పరిశీలించి దిండి పంచాయతీ పరిశావారిపాలెంలో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్, ఓడరేవు అభివృద్ధి పనులను కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ బుధవారం పరిశీలించారు. మండలంలో 192.42 ఎకరాలలో ఆక్వా పార్క్ అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఆక్వా పార్క్ అభివృద్ధికి టెండర్ ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు ప్రారంభించకపోవటంపై కారణాలు, అడ్డంకులపై మేరటైన్ బోర్డు అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిధులు మంజూరు దృష్ట్యా పనులను వెంటనే ప్రారంభించి ఏడాదిలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిజాంపట్నంలోని ఓడరేవు అభివృద్ధి పనులకు 2022లో అగ్రిమెంట్ తీసుకొని, ఇప్పటివరకు పనులు పూర్తి చేయకపోవడానికి కారణాలపై అధికారులను ఆరా తీశారు. ఓడరేవులో జెట్టి నిర్మాణ పనులు పూర్తి కాగా, బ్యాక్ వాటర్ పనులు ప్రారంభించి మూడు నెలలలో పూర్తి చేస్తామని అధికారులు ఆయనకు వివరించారు. ఆక్వా పార్కు, ఓడరేవు అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మత్స్య శాఖ జేడీ శ్రీనివాస్ నాయక్, ఉప సంచాలకులు గాలి దేవుడు, రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారి రామలక్ష్మి, నిజాంపట్నం ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ ఎం.శ్రీనివాసరావు, మేరటైన్ బోర్డు డీఈ సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



హార్బర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నివాసాల మధ్య కొండచిలువ

భయంతో మట్టుబెట్టిన స్థానికులు

తాడేపల్లి రూరల్: మండలంలోని ఉండవల్లి సెంటర్ హిందూ శ్మశానవాటిక దగ్గరున్న నివాసాల మధ్యలో బుధవారం ఏడు అడుగుల పొడవున్న కొండచిలువ హల్‌చల్ చేసింది. తెల్లవారుజామున ఇళ్లల్లోకి దూరి, కోళ్లు తినే ప్రయత్నం చేసింది. గమనించిన స్థానికులు పెద్ద పెద్ద కేకలు వేయడంతో కోళ్ల గంప నుంచి బయటకు వచ్చింది. రోడ్డుకు ఇరువైపులా తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. దీంతో స్థానికులు భయంతో దాన్ని చంపేశారు. పీడబ్ల్యూడీ వర్క్‌షాపులో ఉన్న సామగ్రి తొలగించడంతో అక్కడి నుంచి కొండచిలువ వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంకా ఇలాంటి విష సర్పాలు ఎన్ని వస్తాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



క్లుప్తంగా

సత్తెనపల్లిలో వ్యాపారి బలవన్మరణం

సత్తెనపల్లి: వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని సంఘం బజార్‌కు చెందిన చెందిన లఘువరపు హనుమంతరావు(52) వెంకట భాను జనరల్‌స్టోర్ నిర్వహిస్తుంటాడు. ఆయనకు భార్య శైలజ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత 8 నెలలుగా సోదరుడి కుమారుడు లఘువరపు రమేష్, బావమరిది దరివేముల రామకృష్ణతో వ్యాపార, కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈ క్రమంలో వ్యాపారానికి సోదరుడి కుమారుడైన రమేష్ అడ్డుతగలడం, కుటుంబం విషయంలో బావమరిది రామకృష్ణ ప్రమేయంతో మనస్తాపం చెందిన హనుమంతరావు ఈ నెల 12న గడ్డి మందు కొనుక్కొని తన దుకాణంలో తాగి ఇంటికి వెళ్లాడు. ఇంటి వద్ద వాంతులు చేసుకోవడంతో భార్య శైలజ గమనించి హుటాహుటిన పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించగా ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించారు. చికిత్స పొందుతూ హనుమంతరావు బుధవారం మృతి చెందాడు. పట్టణ ట్రైనీ ఎస్ఐ యష్న మృతుడి వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలోని సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడిపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల సంక్షేమం కోసం ఏర్పాటు చేయబడిన ఈ హాస్టల్స్‌లో సమస్యలు తిష్టవేశాయన్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిస్థితి మారలేదన్నారు. మంగళగిరి నడిబొడ్డున నేషనల్ హైవే పక్కన ఎస్.సి. బాలుర హాస్టల్‌లో అత్యంత ఘోరంగా వసతులు ఉన్నాయన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉండి కూడా తన నియోజకవర్గ పరిధిలోని హాస్టల్‌ల సమస్యల పరిష్కారానికి లోకేష్ చొరవ చూపకపోవడం తగదన్నారు. సమావేశంలో ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు నిబంధనలు సడలించాలి

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): డాక్టర్ స్వామినాథన్ సిఫారసుల ప్రకారం క్వింటా పత్తికి రూ.10,073 ధర నిర్ణయించి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, గుంటూరు జిల్లా కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.వి. జగనాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యాలయంలోని మల్లయ్య లింగంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పత్తి కొనుగోలులో వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కూడా దక్కనివ్వడం లేదన్నారు. క్వింటా పత్తిని రూ.5 వేలలోపునకు కొనుగోలు చేసి రైతుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని కనీస మద్దతు ధర రూ.7,710 ప్రకారమైనా కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రావు బాలసరస్వతి... అనుకరణలకు అతీతమైన అద్భుత స్వరం...ప్రేక్షకులకో వరం. సంగీతంలో ప్రత్యేక శిక్షణ లేకుండానే తనదైన శైలిని, బాణీలో విశిష్టతను సాధించారు. సినీ సంగీతానికి కొత్త ఒరవడిని కల్పించారు. లలిత సంగీతం పేరుతో నూతన విభాగాన్ని ఆవిష్కరించారు. ఆరేళ్ల బాల్యంలో ఆరంభించి, రెండున్నర దశాబ్దాలు విరామం లేకుండా సినిమా, రేడియో, ప్రైవేటు గ్రామఫోన్ రికార్డుల్లో ఆమె స్వరం వీనులవిందు చేసింది. వివిధ భాషల్లో మూడువేలకు పైగా గీతాలను మధురంగా ఆలపించిన తొలి తరం నేపథ్యగాయని ఆమె ఉమ్మడి గుంటూరు జిల్లా వాసి కావటం విశేషం.

లలిత సంగీత సరస్వతి

- తొలి అడుగులు గుంటూరులోనే..
- బాలగాయనిగా ఇక్కడి నుంచే సినీప్రస్థానం
- గతంలో విశిష్ట సేవా పురస్కారంతో సత్కారం


2015లో గుంటూరులో సేవా పురస్కారం ప్రదానం


బాలసరస్వతి (ఫైల్)

తెనాలి: బాలసరస్వతి స్వస్థలం ఉమ్మడి తెనాలి డివిజనులోని బాపట్ల. 1928 ఆగస్టు 28న జన్మించారు. తల్లిదండ్రులు విశాలాక్షి, పార్థసారథిరావు. లలిత కళలపై అభిమానం కలిగిన తండ్రి సితార, వీణ వాయించేవారు. గుంటూరులో రత్నా థియేటర్ పేరుతో సినిమాహాలు నిర్మించారు. థియేటరులో ప్రదర్శించే ఏదైనా సినిమాలో సంగీతానికి తగినంత ప్రాధాన్యం లేదని అనిపిస్తే, వెంటనే ఆ సినిమా ప్రదర్శన నిలిపివేసి, అందుబాటులో ఉన్న నాటక సమాజాన్ని పిలిపించి, పద్యనాటకం వేయించారు. అంతటి సంగీతాభిమాని ఆయన. కాలక్రమంలో వ్యాపారం దెబ్బతిని, థియేటర్ మూతపడింది.

వారసత్వంగా ...

తండ్రి వారసత్వం అన్నట్టుగా బాలసరస్వతికి సంగీతంపై ఆసక్తి ఏర్పడింది. అక్క, అన్నయ్య చక్కగా చదువుకుంటున్నా తండ్రితోపాటు నాటకాలు చూడటం, వాటిలోని పాటలు గానం చేయటం అలవాటైంది. అప్పట్లో గుంటూరులో హెచ్ఎంవీ (హిజ్ మాస్టర్స్ వాయిస్) గ్రామఫోను కంపెనీ ఆఫీసుండేది. పార్థసారిథిరావుకు పరిచయస్తులు. ఓసారి బాలసరస్వతిని పిలిపించి, ట్రెనింగ్‌లా పాడమన్నారు. బాగుండటంతో బెంగళూరులో రికార్డు చేశారు. ఆ విధంగా 1934లో ఆరేళ్ల వయసులో సోలో రికార్డు పాడిన ఘనతను బాలసరస్వతి దక్కించుకున్నారు. మైకు అందేంత ఎత్తు లేకపోవటతో సినీనటుడు సత్యం సోదరుడు కామేశ్వరరావు ఎత్తుకోగా, ఆమె ఆ పాట పాడారు.

శ్రోతలను ఆకట్టుకునేలా..

అంతకుముందు 1941లో రేణుకావారి 'భాగ్యలక్ష్మి' సినిమాలో బీఎస్ఆర్ సంగీత దర్శకత్వంలో పాడిన 'తిన్నెమీద చిన్నోడా' పాట బాలసరస్వతి తొలి ప్లేబాక్ పాట. సుతిమెత్తగా, చక్కని భావప్రకటనతో, ప్రత్యేకమైన పాడే విధానంతో శ్రోతలను ఆకట్టుకుని మనసు లోతుల్లోకి ప్రవహించే అమృతధారగా పాటను మార్చుకున్న ప్రతిభాశాలి బాలసరస్వతి. 'స్వప్నసుందరి'లో కథానాయిక కోసం పాడినా, 'దేవదాసు'లో ద్వితీయ నాయికకు గానం చేసినా ఆమె తనకు తానే సాటిగా నిలిచారు. సినిమాలకు పాడుతూనే ఎస్.రాజేశ్వరరావు, బాలసరస్వతి కలిసి 'లలిత సంగీతం' పేరిట, తెలుగు సంగీత ప్రపంచంలో కొత్త విభాగాన్ని ఆవిష్కరించారు. ఆకాశవాణిలో వీరిద్దరూ పాడే లలిత గీతాలు లక్షల సంఖ్యలో అభిమానులను సంపాదించారు. 1946లో సింహళ చిత్రం 'లైలా మజ్నూ'కు సంగీతం సమకూర్చారు. తాను సోలోగా పాడిన ప్రైవేటు గీతాలకు స్వయంగా సంగీతబద్ధం చేసుకుంటూ వచ్చారు. 1974లో భర్త మరణం, దివాణాలు, వైభవాలు అంతరించటంతో చెన్నై, తర్వాత మైసూరు, బెంగళూరులో ఉంటూ 1995లో హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. భూముల నష్ట పరిహారమూ అందలేదు. మైసూరు నుంచి హైదరాబాద్ వస్తే సాంస్కృతిక శాఖలో ఉద్యోగం ఇస్తామన్న ఎన్టీ రామారావు ఆహ్వానంపై ఇక్కడికి వచ్చేసరికి రాకీయాలు మారిపోయాయి. 2015లో గుంటూరులో బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ బాలసరస్వతిని విశిష్ట సేవా పురస్కారంతో సత్కరించి రూ.లక్ష, రజత జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా 'నిండుపున్నమి పండువెన్నెల' పేరుతో అభినందన సంచికను విడుదల చేశారు.


తెనాలి నటులతో కలిసి నటించిన 'రాధిక' చిత్రంలో..

అలా బీజం పడింది...

ఆ సమయంలో అక్కడే ఉన్న సుప్రసిద్ధ దర్శకుడు సి.పుల్లయ్య, తన 'సతీఅనసూయ–భక్త ధృవ' సినిమాలో బాలనటిగా తీసుకున్నారు. అందులో గంగ పాత్రలో నటిస్తూ బాలసరస్వతి పాడిన పాట 'ఏదీ దారి నాకిచట' ఆ రోజుల్లో పెద్ద హిట్. కోల్‌కతాలో ఈ షూటింగ్ జరుగుతుండగా, అక్కడే చిత్రీకరిస్తున్న తమిళ చిత్రం 'భక్త కుచేల'లో రెండు పాత్రలు ఇచ్చారు. మొదటి భాగంలో చిన్న కృష్ణుడు, రెండో భాగంలో కుచేలుని కూతురు పాత్రలో పోషించారు. అందులో పాటలు కూడా తానే పాడారు. తర్వాత 'బాలయోగిని' తమిళ సినిమాలో టైటిల్ రోల్ తనదే. అప్పటివరకు సరస్వతిగా ఉన్న ఆమె పేరుకు ముందు 'బాల' అని అప్పుడే కలిపారు. తన సినిమాల్లోని పాటలు, బయట కచేరీల్లో పాడుతూ బహుమతులను అందుకుంటూ వచ్చారు. బాలయోగిని సినిమా తర్వాత చెన్నైలో సెటిలయ్యారు. బాలనటిగా 'తుకారం' (1937), 'మహానంద', 'తిరునీలంకర్' (1939) సినిమాల్లో నటించాక, 1940లో ఇందిరా వారి 'ఇల్లాలు' సినిమాలో సంగీత దర్శకుడు ఎస్.రాజేశ్వరరావుతో కలిసి నటించారు. వరుసగా సినిమాల్లో నటిస్తుండగానే 1944లో తూర్పుగోదావరి జిల్లా కోలంక జమీందారు రావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావుతో వివాహమైంది. దీనితో నటనకు స్వస్తిపలికి, పాటలకే పరిమితమయ్యారు.

మైక్రో ఫైనాన్స్ బాధితుల సమస్యలు పరిష్కరించాలి

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్



మైక్రో ఫైనాన్స్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

రేపల్లె: పేదలపై ఐఐఎఫ్ఎల్ మైక్రో ఫైనాన్స్ అధికారులు తమ జులుం ప్రదర్శించటం మానుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సిహెచ్.మణిలాల్ డిమాండ్ చేశారు. ఐఐఎఫ్ఎల్ మైక్రో ఫైనాన్స్ కార్యాలయం వద్ద సీపీఎం, ఐద్వాల ఆధ్వర్యంలో బుధవారం బాధితులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలను అధిక వడ్డీలు కట్టాలని వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అధిక వడ్డీలను మాఫీ చేయాలని, న్యాయబద్ధంగా అసలు మాత్రమే కటించుకోవాలని కోరారు. పేదలకు ఇళ్లపట్టాలపై రుణాన్ని ఇస్తామని నమ్మించి ఏజెంట్ల ద్వారా తక్కువ వడ్డీ అని ఇంగ్లిష్‌లోని లోన్ అగ్రిమెంట్‌పై పేదలతో సంతకాలు చేయించుకుంటున్నారని విమర్శించారు. ఏజెంట్లు, గతంలో పనిచేసినా ఐఐఎఫ్ఎల్ ఉద్యోగులు పేదలను మోసం చేసి కమిషన్‌లు వసూలు చేసుకుని ఉద్యోగాలు నుంచి మానేశారని చెప్పారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఐఏఎఫ్ఎల్ రికవరీ అధికారులు అధిక వడ్డీలు కట్టాలని నిరంతరం ఫోన్ కాల్స్ చేసి ఇళ్లపై ఐఐఎఫ్ఎల్ పేర్లు రాస్తామంటూ వేధింపులు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. రాత్రిళ్లు కూడా మహిళలకు ఫోన్లు చేయటం, వేధించడమే కాకుండా అర్ధరాత్రి 12 గంటలకు కూడా ఇళ్ల తలుపులు కొట్టడం దారుణమని చెప్పారు. ఈఎంఐలు చెల్లించటంలో ఆలస్యం జరిగితే మరో విధంగా వేధింపులకు పాల్పడుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.2,82,000 రుణాన్ని ఇచ్చి నెలకు రూ.7,100 చొప్పున 7 ఏళ్ల పాటు రూ.6 లక్షలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని వివరించారు. బాధితులు ఎంత చెల్లించింది, ఇంకెంత చెల్లించాల్సి ఉందని కార్యాలయంలో అడిగితే సరైన సమాధానం ఇవ్వటంలేదన్నారు. తాము పొందిన రుణాన్ని తిరిగి మొత్తం చెల్లించేందుకు కార్యాలయానికి వెళ్లితే సమాధానం ఇవ్వడంలేదని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పేదలపై అధిక వడ్డీలకు పాల్పడటం తగదని, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని మైక్రోఫైనాన్స్ అధికారులను హెచ్చరించారు. అనంతరం కలెక్షన్ మేనేజర్ కార్తికేయకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్షురాలు షకీరా, కార్యదర్శి కె.నాంచారమ్మ, బాధిత కుటుంబాల సభ్యులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

భర్త ఇంటి ముందు భార్య నిరసన

చీరాల: భర్త ఇంటి ముందు భార్య బుధవారం నిరసనకు దిగింది. చీరాల మండలం బోయినవారిపాలేనికి చెందిన చంద్రశేఖరరావుతో వేటపాలెం మండలం బచ్చులవారిపాలేనికి చెందిన మహిళకు రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. చంద్రశేఖరరావు బాపట్ల ఎస్పీ కార్యాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే కట్నం కోసం వేధింపులు చేస్తున్నట్లు మహిళ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గత కొంత కాలంగా ఈ వ్యవహారం జరగడంతో చంద్రశేఖరరావు ఇంటికి తాళం వేసి బాపట్లలో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఆమె ఇంటి ముందు బైఠాయించి న్యాయం చేయాలంటూ నిరసన తెలిపింది.

వివాహిత మృతదేహం లభ్యం



బల్లికురవ: వారం రోజుల క్రితం అదృశ్యమైన వివాహిత మృతదేహం మంగళవారం రాత్రి అద్దంకి బ్రాంచ్‌కాలువ వైదన సమీపంలో లభ్యమైంది. బల్లికురవ ఎస్ఐ వై.నాగరాజు అందించిన వివరాలు.. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన కర్రి పార్వతి(44) ను వినుకొండ మండలం పిట్టంబండ గ్రామానికి చెందిన నాగేశ్వరరావుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరి పిల్లలు. ఈనెల 7వ తేదీ సాయంత్రం శావల్యాపురం మండలం గంటావారిపాలెం గ్రామంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయానికి నిద్ర చేసేందుకు వచ్చింది. 8వ తేదీ ఉదయం అద్దంకి బ్రాంచ్ కాలువలో స్నానానికి వెళ్లి ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయింది. భార్య ఇంటికి రాకపోవటంతో భర్త, కుటుంబ సభ్యులు వెతుకుతూ మంగళవారం శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా మృత దేహం కాలువలోపడి వైదన వద్దకు కొట్టుకొచ్చింది. అక్కడ పొలాల్లోని రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

తండ్రి మందలించాడని..

ఇంటి నుంచి వెళ్లిపోయిన కొడుకు



కారంచేడు: ఖాళీగా ఉండటం ఎందుకు.. ఏదో ఒక పనిచేసుకొని నాలుగు రాళ్లు సంపాదించవచ్చు కదా. అని అన్నందుకు తండ్రిపై కొడుకు అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా కనపడకపోవడంతో పోలీసులకు బుధవారం తండ్రి ఫిర్యాదు చేశాడు. కారంచేడు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా తెలిపిన వివరాలు.. మండలంలోని తిమిడెదపాడు గ్రామానికి చెందిన తమ్మల ప్రసాద్‌కు ముగ్గురు సంతానం కాగా ఇద్దరికి వివాహాలు చేశాడు. మూడో కుమారుడైన జయప్రకాశ్ ఈనెల 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి కనిపించకుండా పోయాడు. ఐటీఐ పూర్తి చేసిన జయప్రకాశ్ కొన్ని రోజులు హైదరాబాద్‌లో ఉండి ఉద్యోగం చేశాడు. తనకు బెంగగా ఉందని ఇంటికి రమ్మని తండ్రి కోరడంతో తిరిగి ఇంటికి వచ్చాడు. అయితే వచ్చిన దగ్గర నుంచి ఏ పనికీ వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండటంతో తండ్రి మందలించి పనులు చేసుకోవాలని సూచించాడు. దీంతో అతను అలిగి పారిపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని ఒడిశా వాసి మృతి

మార్టూరు: ఆర్థిక ఇబ్బందులతో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి ఉరివేసుకొని మృతి చెందిన ఘటన మండలంలోని జొన్నతాళి సమీపంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఒడిశాలోని భద్రక్ జిల్లా ఉగల్ పూర్ గ్రామానికి చెందిన ప్రదీప్ థాల్(55) కొంతకాలంగా స్థానిక జాతీయ రహదారి పక్కన జొన్నతాళి స్టేజీ సర్వీస్ రోడ్డులో ఫ్యాన్సీ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారం బాగా జరగని కారణంగా ఆర్థిక ఇబ్బందులు పెరిగి మనస్తాపానికి గురై బుధవారం మధ్యాహ్నం తను నివాసం ఉండే రేకుల షెడ్డుకు ఇనుప రాడ్డుకు తాడుతో ఉరి వేసుకొని మృతి చెందాడు. సాయంత్రం గమనించిన ఇరుగు పొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం


పురస్కారాల కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

బాపట్ల: కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు అందించనున్న ప్రతిభ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని సంఘం జిల్లా అధ్యక్షులు ఇక్కుర్తి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక అన్నం సతీష్‌ప్రభాకర్ కాపు కళ్యాణ మండపంలో కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించే కార్తిక వన సమారాధన సమయంలో అందజేస్తున్న విధంగా నే నవంబరు 16వ తేదీన పురస్కారాలు అందజేయనున్నట్లు చెప్పారు. బాపట్ల నియోజకవర్గానికి సంబంధించిన విద్యార్థులు, ఇంటర్ మొదటి సంవత్సరం నుంచి పై చదువులు చదువుతున్న 60 శాతం మార్కులు మించిన వారు ఈనెల 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుతో పాటు సంబంధిత సర్టిఫికెట్స్, జత చేసి అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కళ్యాణ మండపంలో అందజేయాలని సూచించారు. వివరాలకు కె.శ్రీనివాసరావు 9346569982ను సంప్రదించాలని కోరారు.

ఆర్మీ జవానుకు అంతిమ వీడ్కోలు


జవాను భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్మీ ఉద్యోగులు, మాజీ సైనికులు

బాపట్ల: ఆర్మీ జవాను ఆసోది గోపిరెడ్డి అంత్యక్రియలు బాపట్ల మండలం ఆసోదివారిపాలెంలో సైనిక లాంఛనాలతో బుధవారం నిర్వహించారు. మాజీ సైనిక ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు తెలిపిన వివరాలు... ప్రకారం ఆసోదివారిపాలేనికి చెందిన సర్వింగ్ సోల్జర్ ఆసోది గోపిరెడ్డి సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. గత నెల 29 బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీ వెనుక వైపు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదంలో గాయాలపాలైన గోపిరెడ్డి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని తెలిపారు. ఆర్మీ జవాను స్వగ్రామంలో జరిగిన అంతిమ యాత్రలో ఉమ్మడి గుంటూరు జిల్లా సైనిక సంక్షేమ విభాగం అధికారులు, మాజీ సైనికులు పాల్గొన్నారు. గోపిరెడ్డికి భార్య వెంకటలక్ష్మి, కుమార్తె వినన్య, కుమారుడు దేవాన్ష్ నందన రెడ్డి ఉన్నారు.

జిల్లా స్థాయి ఆటల పోటీలకు వేటపాలెం విద్యార్థులు



వేటపాలెం: జిల్లా స్థాయి ఆటల పోటీలకు స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు హెచ్ఎం దేవర కొండ సరోజిని బుధవారం తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ ఇంకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేష్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి ఆటల పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. అథ్లెటిక్స్ రోజా, అండర్– 17 విభాగంలో వైష్ణవి, లాస్య, యమున, యశస్విని, అండర్– 14 విభాగంలో వైష్ణవి, కబడ్డీ అండర్– 17 విభాగంలో గాయత్రి, హిమబిందు, లాస్య, అండర్– 14 విభాగంలో వైష్ణవి, నస్రిన్, వాలీబాల్ అండర్–17 విభాగంలో గాయత్రి, హిమబిందు, అండర్–14 విభాగంలో వైష్ణవి, నస్రిన్, యోగా– 17 విభాగంలో కావ్య, లావణ్య, ఆసిఫ, అండర్ – 14 విభాగంలో చాందిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను పీఈటీలు జె.దేవభిక్షం, జె.శ్రావణి అభినందించారు.

యువతిని ప్రేమించి మోసం చేసిన యువకుడిపై కేసు

భట్టిప్రోలు: యువతిని ప్రేమించి పెళ్లికి నిరాకరించిన ఓ యువకుడిపై పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్ఐ ఎం.శివయ్య కథనం.. భట్టిప్రోలు మండలం పెదలంక మధ్యగూడెం గ్రామానికి చెందిన గొరిగపూడి స్రవంతి, కృష్ణా జిల్లా చల్లపల్లి మండలం ఆముదార్లంకకు చెందిన ఆలూరి పూర్ణ చంద్ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. యువతిని నమ్మించి లైంగికంగా కలిశాడు. దీంతో యువతి పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకుందామని పట్టుపట్టింది. అప్పుడు డిగ్రీ చదువుతున్న యువకుడు పెళ్లి చేసుకుంటే మధ్యలో చదువు ఆగిపోతుందని తనపై నమ్మకం లేదా అని యువతిని నమ్మించి పసుపు తాడు తీసుకొచ్చి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవంతంగా ఆమెకు తాళి కట్టాడు. అప్పటి నుంచి స్రవంతిని శారీరకంగా కలుస్తున్నాడు. ఈ క్రమంలో యువతి గర్భం దాల్చడంతో విషయాన్ని యువకుడికి చెప్పింది. గర్భం తీయించుకోమని ఒత్తిడి చేశాడు. ఆ యువకుడి మాటలు నమ్మి ఓ ప్రైవేట్ వైద్యశాలలో అబార్షన్ చేయించుకుంది. ఇటీవల ఆమె ఫోన్ నంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాడు. అనుమానం వచ్చి ఆమె మోసం చేస్తున్నాడని భావించి కుటుంబ సభ్యులకు విషయాన్ని వివరించింది. యువతి తల్లిదండ్రులు పెద్దల ద్వారా యువకుడి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి ఇరువురికి వివాహం చేద్దామని ప్రయత్నించారు. ఆ యువకుడు, తల్లిదండ్రులు పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో సంఘ పెద్దల సమక్షంలో రాజీ చేసుకునేందుకు ప్రయత్నించారు. యువతి అంగీకరించలేదు. పెళ్లి చేసుకోవాలని పట్టుబట్టింది. యువకుడి కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో యువతి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ ఎండీ మొయిన్

చీరాల: ఏడేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడు పిట్ల సూరిబాబును బుధవారం అరెస్ట్ చేరు. ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ ఎండీ మొయిన్ వివరాలు వెల్లడించారు. వేటపాలెం మండలం అక్కాయపాలెం పంచాయతీలోని చీరాల ఇంజినీరింగ్ కాలేజీ వెనుక ఉన్న జంగిలి కోటేశ్వరరావు కాలనీకి చెందిన పిట్ల సూరిబాబు అనే వ్యక్తి మద్యానికి బానిసై కాలనీలోని ఆడపిల్లలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తుండే వాడు. ఈ విషయంలో పలుమార్లు కాలనీవాసులు మందలించారు. ఈనెల 10వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో అదే ప్రాంతానికి చెందిన ఏడు సంవత్సరాల బాలికను తినుబండారాలు కొనిస్తానని మాయ మాటలు చెప్పి ఆ కాలనీలోని పాడుబడిన ఇంటిలోనికి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. అది గమనించిన తోటి బాలిక వారి తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో స్థానికులు వచ్చి సూరిబాబుకు దేహశుద్ధి చేయడంతో అక్కడ నుంచి తప్పించుకొని పారిపోయాడు. ఈ మేరకు బాలిక తల్లి ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేశారు. నిందితుడు కటారివారిపాలెంలోని జీడితోటలో ఉండగా.. అందిన సమాచారం మేరకు బుధవారం మధ్యాహ్నం మధ్యవర్తుల సమక్షంలో జీడితోటల్లో నక్కి ఉన్న నిందితుడిని అరెస్ట్ చేశారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచనున్నారు. సమావేశంలో రూరల్ సీఐ ఎం.శేషగిరిరావు, రూరల్ ఎస్ఐ ఎ.చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ఇండస్ట్రియల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్ విడుదల

లక్ష్మీపురం: ఏపీఐఐసీ – ఇండస్ట్రీ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. నవంబర్ 14, 15వ తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న భాగస్వామ్య సదస్సు (పార్టనర్ షిప్ సమ్మిట్)లో భాగంగా ఈ పోస్టర్ విడుదల చేశామని తెలిపారు. పీసీబీ కార్యనిర్వాహక ఇంజినీరు ఎం.డి.నజీనా బేగం, ఏపీఐఐసీ జీఎం డాక్టర్ ఎం.ఎల్ నరసింహారావు, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఎ. జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రైలులో ప్రయాణికురాలిపై అత్యాచారం

– కత్తితో బెదిరించి అఘాయిత్యం చేసిన దుండగుడు

లక్ష్మీపురం: మహిళల బోగీలో ఒంటరిగా ఉన్న ప్రయాణికురాలిపై గుర్తు తెలియని వ్యక్తి అత్యాచారం చేశాడు. సెల్‌ఫోన్, నగదు తీసుకుని పారిపోయాడు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. రాజమండ్రి ప్రాంతానికి చెందిన సుమారు 35 ఏళ్ల ఓ మహిళ మంగళవారం సంత్రగచి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు చర్లపల్లి వరకు వెళ్లేందుకు ఎక్కారు. గుంటూరు రైల్వే స్టేషన్ వద్దకు వచ్చేసరికి ఆ బోగీలో అందరూ దిగిపోయారు. ఇదే అదనుగా ఓ గుర్తు తెలియని వ్యక్తి లోపలికి చొరబడ్డాడు. పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలోకి వచ్చాక ఆ మహిళను కత్తితో బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె నుంచి రూ.5,600 నగదు, సెల్‌ఫోన్ లాక్కుని పెదకూరపాడు స్టేషన్‌కు సమీపంలో రైలులో నుంచి దూకి పారిపోయాడు. బాధితురాలు సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. గుంటూరు నుంచి పెదకూరపాడు ప్రాంతాల మధ్యలో సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి రెండేళ్ల జైలు

మంగళగిరి టౌన్: యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి రెండేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానా విధిస్తూ మంగళగిరి అడిషనల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కమ్ సివిల్ జడ్జి, జూనియర్ డివిజన్ ఎం.ప్రసన్న లక్ష్మి బుధవారం వెలువరించారు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి మండలంలోని నూతక్కి గ్రామానికి చెందిన ఓ యువతి 2019లో ఇంటి వద్ద స్నానం చేస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన బోళ్ల వెంకటరెడ్డి తొంగిచూశాడు. ఆమె గమనించి ఇంట్లోకి వెళ్లారు. అతడూ వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు వచ్చారు. నిందితుడు పరారయ్యాడు. మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై శ్రీనివాసరెడ్డి కేసు దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. 2 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తాజాగా తీర్పు వెలువరించారు. అసిస్టెంట్ ప్రాసిక్యూటర్ ఎ.శివలీల ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

ఆధిపత్య పోరుతోనే హత్య

తెనాలిరూరల్: తెనాలిలో కలకలం సృష్టించిన హత్య కేసును పోలీసు ఛేదించినట్టు సమాచారం. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం కోరుతాడిపర్రుకు చెందిన జూటూరి తిరుపతిరావు అలియాస్ బుజ్జి తెనాలిలో మంగళవారం దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే నిందితుడిని గుర్తించినట్టు తెలిసింది. గ్రామంలోని రామాలయం విషయంలో ఆధిపత్య పోరు ఉన్న వరుసకు అల్లుడయ్యే వ్యక్తే హత్యకు ప్పాడ్డాడని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ప్రస్తుతం నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం.